క్లుప్తంగా

ఘనంగా జానపద కళల దినోత్సవం



జానపద నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దర్శి: ప్రపంచ జానపద కళల దినోత్సాని కట్ట శింగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు పి.సుధాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు గొర్రెపాటి వేణు విద్యార్థులచే వేయించిన జానపద వేషాలు, నాటికలు అందరినీ అలరింపజేశాయి. ఈ సందర్భంగా సుధాకర్‌రావు మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలతో పాటు భారతీయ జానపద కళలను రక్షించుకోవాలన్నారు. కళలను చూడటం వివిధ పాత్రల్లో నటించడం ద్వారా నిజమైన ఆనందాన్ని పొందవచ్చని చెప్పారు. ఉపాధ్యాయులు సీహెచ్ హైమావతి, సయ్యద్ సుభానీ పాల్గొన్నారు.

ఇండ్లచెరువులో ఉపాధి గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఓ దేవయ్య

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ టి.దేవయ్య అధ్యక్షతన గురువారం ఎన్‌ఆర్‌ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 2023 ఏప్రిల్1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన గ్రామ సభలను చదివి వినిపించారు. చెక్ డ్యామ్‌లు, పూడిక తీత, గుంతల పనులను హౌసింగ్ బిల్లులు తదితర పనుల గురించి వివరించారు. 24వ తేదీన ఎంపీడీఓ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తామని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు హాజరు కావాలని ఏపీఓ దేవయ్య కోరారు.

కురిచేడులో తిరుపతి రైలు ఆపాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

కురిచేడు: గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు బండి కురిచేడు స్టేషన్లో ఆపాలని మండలంలోని దేకనకొండ గ్రామానికి చెందిన కురంగి నాగేశ్వరరావు మంత్రి సత్యకుమార్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గుంటూరులోని ఆయన కార్యాలయానికి వెళ్లి తిరుపతి రైలుబండితో పాటు కురిచేడులో మోడల్ పాఠశాల నిర్మించాలని వినతిపత్రం అందజేశారు.

నేషనల్ హైవేపై ప్రమాదం

● ఇద్దరికి గాయాలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై ఆర్టీసీ బస్ బొలెరో వాహనం ఢీకొట్టుకున్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం మండలంలోని రాజుపాలెం వద్ద గురువారం జరిగింది. వివరాలు.. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం అబ్బూరుకు చెందిన ఎస్.కోటేశ్వరరావు తన కుమారుడు బలరాంతో కలిసి బొలెరో వాహనంలో గేదెలను తీసుకుని కర్నూలు నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. విజయవాడ వైపు నుంచి కర్నూలు వెళ్తున్న ఆర్టీసీ ఏసీ కోచ్ ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో గాయపడిన కోటేశ్వరరావు, బలరామ్‌లను అంబులెన్స్‌లో వైద్యం కోసం నర్సరావుపేట తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంది పంటలో పొలంబడి



పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

కురిచేడు: పంచాయతీ పరిధిలోని కందిపంటలో మండల వ్యవసాయాధికారి పి.మధుబాబు ఆధ్వర్యంలో గురువారం పొలంబడి జరిగింది. పంట కోసే వరకు ప్రతి 15 రోజులకు ఒకసారి ఈ కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయాధికారి తెలిపారు. రైతులు దున్ని పెట్టుకున్న పొలాల్లో పండించిన విత్తనాన్ని వేస్తే ముందుగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఇందుకు గాను కార్బెండిజం, ఇమిడక్లోప్రిడ్ ట్రైకోడెర్మా విరిడిలను వాడుకోవచ్చన్నారు. అధికంగా పురుగుమందులకు అయ్యే వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడులు వచ్చేలా చేయటమే పొలంబడి ఉద్దేశమన్నారు. రైతుల అనుభవాలు తెలుసుకుని వారికి సాంకేతిక సలహాలు అందిస్తూ వారికి సహకరించటమే పొలంబడి ఉద్దేశమన్నారు. రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు వెంకటేశ్వర్లు, రామాంజి, నాయక్ పాల్గొన్నారు.

మిర్చి సాగుపై వెనకడుగు



పెద్దారవీడు నర్సరీలో మిరప మొక్కలు



పెద్దారవీడు దొడ్డిలో పొగాకు నారు

● పొగాకు పంట సాగుపై రైతుల మక్కువ

పెద్దారవీడు:

బోరు బావుల కింద సాగు చేసే మిరప పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు ఎక్కువ శాతం మక్కువ చూపుతున్నారు. రెడీమెడ్‌గా నర్సరీల్లో దొరికే మిరప మొక్కలను కొనుగోలు చేసి నాటుతున్నారు. గతంలో మిరప పంటను 4 నుంచి 10 ఎకరాల వరకు రైతులు సాగు చేసేవారు. ఈ ఏడాది పొగాకు పంట సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. ఖరీఫ్ సీజన్లో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో మిరప పంటలను 4 నుంచి 8 ఎకరాల వరకు సాగు చేసేవారు. వర్షాభావ పరిస్థితితో బోర్లలో నీరు తగ్గడం, బోరుబావులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు తక్కువ నీటితో పండించే పొగాకు పంట సాగుపై ఆసక్తి చూపుతున్నారు. దీంతో బోర్ల కింద మిరప పంట సాగు విస్తీర్ణంగా గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం మిరప మొక్కలు కొనుగోలు చేసేందుకు రైతులు ముందుకు రాకపోవడంతో నర్సరీలు వెలవెలబోతున్నాయి. మిరప పంట 4 నుంచి 8 ఎకరాలు సాగు చేసే రైతులు విద్యుత్ సరఫరా, బోర్లలో నీటి లభ్యత ఆధారంగా 2 నుంచి 4 ఎకరాల్లో సాగు చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఎర్రగొండపాలెం, మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాలల్లో మిరప పంట 70 శాతం మంది రైతులు సాగు చేసేవారు. మిరప పంట సాగు చేసే రైతులు రెండేళ్ల నుంచి పొగాకు పంటపై మక్కువ చూపుతున్నారు. గతంలో పశ్చిమ ప్రాంతంలో దాదాపు 60 వేల ఎకరాలు మిరప పంటను సాగు చేసేదని, ఇప్పుడు మిరప పంట 20 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉంటుందని, పొగాకు పంట దాదాపు 40 వేల ఎకరాల్లో సాగు చెయవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది 80 శాతం మంది రైతులు పొగాకు పంట సాగుపై దృష్టి సారించారు. గతంలో మిరప పంట సాగు 4 నుంచి 10 ఎకరాలు సాగు చేసే రైతులు ఈ ఏడాది 2 నుంచి 4 ఎకరాలు సాగు చేసేందుకు కూడా సంకోచిస్తున్నారు. మిరప పంట సాగు కంటే పొగాకు పంట సాగు చేసేందుకు రైతులు 3 నుంచి 10 ఎకరాల వరకు సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. మిరప పంట ఎకరానికి రూ.70 నుంచి రూ.90 వేల వరకు ఖర్చువుతుందని, పొగాకు పంటకు ఎకరానికి రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. మిరప పంటకు వచ్చే నల్లి పురుగు, కుచ్చుతెగుళ్లు తదితర తెగుళ్ల పట్టి పీడుస్తుండటంతో పాటు బలం ఎరువులు, రసాయన మందుల ధరలు పెరగడంతో అధిక పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిరప కాయలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పంటను చాలా వరకు తగ్గించారు. పొగాకు పంటకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి రావడంతో పాటు గిట్టుబాటు ధరలు బాగానే ఉన్నాయని రైతులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చని పొగాకు పంటపై మక్కువ చూపిస్తున్నారు. ఇప్పటికే కొన్ని మండలాల్లో రైతులు పొగాకు పంటను సాగు చేశారు. ఇంకా పొగాకు పంట సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.



పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ: మిరప పంట సాగు చేస్తే తెగుళ్ల నివారణ కోసం అధిక పెట్టుబడి పెట్టాలి. అర ఎకరం మిరప పంట, 2 ఎకరాలు పొగాకు పంట సాగు చేస్తున్నాను. పొగాకు సాగు చేస్తే పెట్టుబడి తక్కువ, దిగుబడి ఎక్కువ రావడంతో పాటు ఆదాయం వస్తుంది. పొగాకు పంటకు నీటి తడులతో ఎక్కువ కట్టాల్సిన అవసరం ఉండదు. ప్రస్తుతం పొగాకు ధర బాగా పలుకుతోంది. అందుకే మా గ్రామంలో ఎక్కువ మంది రైతులు పొగాకు పంట సాగు చేసేందుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు.

దూదేకుల కాశయ్య, బి.చెర్లోపల్లి

గ్రామ సభలకు నోడల్ అధికారుల నియామకం

పుల్లలచెరువు: ఉపాధి హామీ గ్రామ సభలకు మండలస్థాయి అధికారులను నోడల్ అధికారులగా నియమించినట్లు ఎంపీడీవో మరియదాసు తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన మండలంలోని 19 సచివాలయాల పరిధిలో ఒక్క రోజు గ్రామసభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామానికి పనులు గుర్తించి అంచనాలు వేసి చర్చించేందుకు గ్రామసభలు ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులన్నీ ఉపాధి పథకం కింద చేపట్టనున్నట్లు తెలిపారు. దీనికి ప్రతి గ్రామానికి అధికారిని నియమించినట్లు చెప్పారు. చాపలమడుగుకు నయామ్ అహ్మద్, గంగవరానికి పార్వతీబాయ్, గారపెంటకు మరియదాసు, ఐటీ వరానికి శామ్యూల్ జాన్, కోమరోలుకు ఇందిరాప్రసాద్, కవలకుంట్లకు లక్ష్మీనరసింహ, మల్లాపాలేనికి నాగప్ప, మానేపల్లికు రవికుమార్, మర్రివేములకు శరత్‌బాబు, ముటకులకు శంకర్‌నాయక్, నరజాముల తండాకు శరత్‌బాబు, నాయుడుపాలేనికి వెంకటయ్య, పెద్ద సీఆర్‌సీ తండాకు నాగుల్‌మీరా, పిపీపల్లికి శ్రీనివాసరెడ్డి, పుల్లలచెరువుకు మరియదాసు, రాచకొండకు శామ్యూల్‌జాన్, శతకోడుకు బాబు, సుద్దకురవ తండాకు నిర్మలాదేవి, యండ్రపల్లికి జాన్‌సుందర్‌లు గ్రామసభల్లో నోడల్ అధికారులు పాల్గొంటారని, గ్రామ ప్రజలు విరివిగా పాల్గొని గ్రామసభలను విజయవంతం చేయాలన్నారు.

కురిచేడు: మండలంలోని అన్ని గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు మంజూరు చేసేందుకు ప్రత్యేక గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు తెలిపారు. ఉదయం 11 గంటలకు అన్ని గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు మంజూరు చేస్తారని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు గ్రామ సభల్లో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

బాధ్యతలు స్వీకరించిన పోలీసు అధికారులు



ఎస్‌ఐ శివ బసవరాజు



బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ నాగరాజు

త్రిపురాంతకం: పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్‌ఐ శివ బసవరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన ఇప్పటి వరకు మర్రిపూడి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తించారు. ఎస్‌ఐను సిబ్బంది, పలువురు ప్రముఖులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్‌ఐ సాంబశివయ్య వీఆర్‌కు బదిలీపై వెళ్లారు.

నేర నియంత్రణకు కృషి

ముండ్లమూరు: మండలంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేర నియంత్రణకు కృషి చేస్తానని ఎస్‌ఐ వై.నాగరాజు తెలిపారు. నూతన ఎస్‌ఐగా ఆయన గురువారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఒంగోలులో పని చేస్తున్న నాగరాజును ముండ్లమూరుకు నియమించారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ప్రధానంగా రైతుల పొలాల్లో విద్యుత్ వైర్లు, మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ నియంత్రణకు రైతుల భాగస్వామ్యంలో ప్రణాళికలు సిద్ధం చేస్తామని చెప్పారు. సిబ్బందిని అప్రమత్తం చేసి గ్రామాల వారీగా పర్యటించి నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. బాధితులకు అండగా నిలిచి వారికి న్యాయం చేస్తామన్నారు. ఆయన్ను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

వైభవంగా శ్రీబాల త్రిపుర సుందరి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న అర్చకులు

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కటకానిపల్లెలో గురువారం జరిగిన శ్రీ బాల త్రిపుర సుందరి, గంగమ్మ, పోతురాజు స్వామి, నాగేంద్ర స్వామి, చెంచు దేవతల పున: ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలను గురువారం గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రతిష్ట కార్యక్రమాలను ఈ నెల 19వ తేదీ సోమవారం నుంచి గురువారం వరకు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన పున:ప్రతిష్ట సందర్భంగా సుదూర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామానికి సంబంధించిన వారందరూ కార్యక్రమానికి హాజరు కావటంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది, స్వస్తిశ్రీ చాంద్రమానేన శ్రీ క్రోధినామ సంవత్సర శ్రావణ బహుళ తదియలకు ఉత్తర బాద్ర నక్షత్రయుక్త కన్యాలగ్న పుష్కరాంశము నందు శ్రీ బాల త్రిపుర సుందరి, గంగమ్మ, పోతురాజు స్వామి, నాగేంద్ర స్వామీ, చెంచు దేవతల పున: ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సిద్ధాంతి బాచిమంచి భరద్వాజశర్మ ఆధ్వర్యంలో ఉదయం కళాన్యాస హోమం, యంత్ర స్థాపన,శిలా స్థాపనస్నపన అలంకారం,పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



గుడి ఎదుట మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్తులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



నుజ్జునుజ్జయిన ద్విచక్ర వాహనం



గాయపడిన సూరజ్ పఠాన్

ముండ్లమూరు: మండలంలోని పోలవరం గ్రామం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పఠాన్ సూరజ్ అనే యువకుడికి గాయాలయ్యాయి. బాపట్ల జిల్లా పర్చూరుకు చెందిన పఠాన్ సూరజ్ ద్విచక్ర వాహనంపై గురువారం దర్శికి బయల్దేరాడు. మార్గంమధ్యలో దర్శి-అద్దంకి ప్రధాన రహదారిలో పూరిమెట్ల నుంచి అద్దంకి వెళ్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో పఠాన్ సూరజ్‌కి తీవ్ర గాయాలుకాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు తీసుకెళ్లారు.

డిగ్రీలో రెండో దశ ప్రవేశాలకు ఆహ్వానం

దర్శి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో దశ ప్రవేశాలు జరుగుతున్నట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ తెలిపారు. ఈ నెల 22 నుంచి 24 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. ధ్రువ పత్రాల పరిశీలన, కోర్సులు, కళాశాల ఎంపికకు వెబ్ ఆప్షన్ నమోదుకు 23 నుంచి 25 వరకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. 29న సీట్లు కేటాయిస్తారన్నారు. సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ మూడో తేదీ వరకు కళాశాలలో చేరవచ్చని ఆయన వివరించారు.

చిరంజీవి జన్మదిన వేడుకలు

కురిచేడు: సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలు గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి సినీ ఫ్యాన్స్ అధ్యక్షుడు పత్తి శ్రీరంగ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కేక్ కట్ చేసి చిరంజీవి ఫొటోకు క్షీరాభిషేకం చేశారు. షేక్ సునీల్, సుంకర కోటయ్య పాల్గొన్నారు.

హలో మాల..చలో విజయవాడ!



సదస్సుకు పిలుపు ఇస్తున్న మాలమహానాడు నాయకులు

దర్శి: విజయవాడలో ఈ నెల 25న మాలల విస్తృత స్థాయి సదస్సును జయప్రదం చేయాలని మాల సంఘాలు పిలుపునిచ్చాయి. మాలమహానాడు, మాల యువసేన, దళిత సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హలోమాల..చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దళిత సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, పీవీ రావు, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దారా అంజయ్యలు తాళ్లూరు వచ్చిన సందర్భంగా మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన క్రిమిలేయర్ తీర్పును పునఃపరిశీలించాలని, మోదీ నక్కజిత్తులను వ్యతిరేకిస్తూ మాలల భవిష్యత్తు ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు మాల కార్యకర్తలు, మాల సంఘాల నాయకులు, మాల మేధావులు, మాల విద్యార్థులు, మాల మహిళలు, మాల ఉద్యోగులు, అంబేడ్కర్ వాదులు భాగస్వాములు కావాలని వారు పిలుపు ఇచ్చారు.



కల్వర్టుపై ఏర్పడిన గుంతలు

కుంగిన కల్వర్టు

● రామాపురం–లక్ష్మీపురం వాసుల అవస్థలు
● పట్టించుకోని సంబంధిత అధికారులు

దొనకొండ: మండలంలోని రామాపురం–లక్ష్మీపురం గ్రామాలను కలుపుతూ మార్కాపురం వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. రోడ్డు చిల్ల చెట్లతో నిండిపోయింది. రామాపురం, లక్ష్మీపురం చెరువుకట్ట వద్ద గతంలో నిర్మించిన కల్వర్టు కుంగి పోయింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, స్కూల్ బస్సులు ప్రతి నిత్యం ఈ రహదారి నుంచి ఉదయం, సాయంత్రం తిరుగుతుంటాయి. కల్వర్టు కుంగి పోవటంతో భయంకరమైన గుంత ఏర్పడి ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యాయి. అధికారులు ఆ దారి నుంచి వెళ్తుంటారు.. వస్తుంటారు. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. వర్షం పడిన సమయంలో కల్వర్టు కుంగిన ప్రదేశంలో నీరు నిలబడి ప్రమాదాలకు నిలయంగా మారింది. సంబంధిత అధికారులు కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చదవడం, రాయడంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఇందిర

పుల్లలచెరువు: ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలు చదవడం, నోట్ పుస్తకాలు రాయడానికి సంబంధించి విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో ఇందిర కోరారు. గురువారం మండలంలోని కోత్తూరు, నాయుడుపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంలో ఆహారాల పదార్థాలు రుచి చూశారు. పాఠశాలలో ప్రభుత్వ కార్యక్రమాల గురించి హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రభుత్వం ఇచ్చే శిక్షణ నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యే విధంగా బోధన చేయాలన్నారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రాయడం, చదవడం నేర్పించాలన్నారు. ఇంగ్లిష్, తెలుగు అంశాలను చదవడం, రాయడం నేర్చుకోవడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

వధూవరులకు ఎమ్మెల్యేల ఆశీర్వాదం



బ్రహ్మనందరెడ్డి కుమారుడి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యేలు తాటిపర్తి, విరూపాక్షి



కార్యకర్త వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దదోర్నాల: మండల పరిధిలో గురువారం జరిగిన పలువురు కార్యకర్తల వివాహాలకు యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యుడు తాటిపర్తి చంద్రశేఖర్, కర్నూల్ జిల్లా ఆలూరు నియోజకవర్గ శాసనసభ్యులు విరూపాక్షిలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలోని లహరి ఫంక్షన్ హాల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు గాదె బ్రహ్మనందరెడ్డి కుమారుడు రఘునాథరెడ్డి, లక్ష్మీపార్వతిల వివాహ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కుమ్మరి కాలనీలో జరిగిన కార్యకర్త రాజారపు కాశీ రాములు, వెంకట మాధురిల వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం మండల పరిధిలోని గంటవానిపల్లెలో జరిగిన సింగంశెట్టి నడిపి రాములు మనవరాలు సౌమ్య, మణికంఠల వివాహ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలోని బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో జరిగిన నాయకుడు యక్కంటి లింగారెడ్డి కుమారుడు నరేంద్రరెడ్డి, అనితల వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో ఎమ్మెల్యేతో పాటు మండల పార్టీ అధ్యక్షుడు గంటా రమణారెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి గుమ్మా యల్లేష్, మండల నాయకులు లాలూనాయక్, యక్కంటి వెంకటేశ్వరరెడ్డి, అల్లు రాంభూపాల్‌రెడ్డి, మొద్దు తిరుపతిరావు, అల్లు రమణారెడ్డి, సోషల్ మీడియా మండల కన్వీనర్ బ్రహ్మనందరెడ్డితో పాటు పెద్దారవీడు నాయకులు వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సోలార్ యూనిట్ ఏర్పాటుకు సహకరించాలి



పొలాలు పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

ముండ్లమూరు: విద్యుత్ కోతలను అధిగమించేందుకు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో నూతన సోలార్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు రైతులు సహకరించాలని ఏపీసీపీడీసీఎల్ సీజీఎం డి.సుబ్బారావు అన్నారు. మండలంలోని శంకరాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన సోలార్ యూనిట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. అందుకోసం సబ్‌స్టేషన్ సమీపంలో కిలోమీటరు పరిధిలో 20 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందన్నారు. ఒక్కో ఎకరానికి ఏడాదికి రూ.30 వేలు కౌలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. సేకరించిన భూమిలో సోలార్ యూనిట్ నెలకొల్పి కోతలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవకాశం ఉందన్నారు. ఆశక్తి ఉన్న రైతులు భూమి ఇచ్చేందుకు ముందుకు వస్తే వారి వివరాలతో ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు పేర్కొన్నారు. ఆయన వెంట విద్యుత్ శాఖ ఒంగోలు ఎస్‌ఈ కేజీవీ సత్యనారాయణ, ఈఈ శ్రీనివాసరావు, డీఈ మోహనరావు, దర్శి ఈఈ అబ్దుల్‌రహీం, ఏడీఈ పిచ్చయ్య, రైతులు పాల్గొన్నారు.